
సాక్షి
బాపట్ల
మంగళవారం । 14 । నవంబర్ । 2023



గండాలయ స్వామికి పూజలు

మంగళగిరి : గండాలయస్వామి కొండపైన సోమవారం భక్తులు బారులు తీరారు. అమావాస్య కావడంతో అఖండ దీపారాధన చేసి పూజలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3,422 క్యూసెక్కులు విడుదల చేశారు.కొమ్మమూరు కాల్వకు 1,520 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి

పిట్టలవానిపాలెం : చందోలు బగళాముఖి అమ్మను ఏపీ హైకోర్టు జడ్జి సుజాత దర్శించుకున్నారు. తెనాలి నుంచి జడ్జి శ్రీధర్, బాపట్ల కోర్టు జడ్జిలు వాణి, రుక్మిణి అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

17న జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : గుంటూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు అండర్–12, 14, 16 బాలబాలికల అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60, 100, 300, 600, 1,000 మీటర్ల పరుగు పందెంతోపాటు లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

నేడు అందుబాటులో మైనార్టీస్ కమిషన్

మంగళగిరి : నగరంలోని రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ కార్యాలయంలో విచారణ కోసం కమిషన్ మంగళవారం అందుబాటులో ఉంటుందని చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీల క్యాటగిరి కిందకు వచ్చే ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, పారసీలు తాము ఎదుర్కొంటున్న అన్ని రకాల సామాజిక సమస్యలను, ఫిర్యాదులను కమిషన్‌కు రాతపూర్వకంగా, నేరుగా తెలపవచ్చునని వివరించారు. కమిషన్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు భవిష్యనిధి పెన్షన్ అదాలత్


గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించాయి. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సప్ నంబరు 9494657469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863–2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 26438264450, పాస్ కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం



తెనాలి: బాలల దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్ ఫిలిం సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 30 వరకు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు జరపనున్నారు. గాంధీనగర్‌లోని ది కల్చరల్ ఫిలిం సొసైటీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సొసైటీ నిర్వాహకులు బి.లలితానంద ప్రసాద్, బొల్లిముంత కృష్ణ వివరాలను తెలియజేశారు. బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు ఆవరణలోని ఏవీఎస్ కళావేదికలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ఫిలిం సొసైటీల ద్వారా ఆయా ప్రాంతాల్లోనూ బాలల చిత్రాల ప్రదర్శన 30వ తేదీ వరకు జరుగుతుందని వివరించారు. బాలల మనోవికాసానికి దోహదపడే చిత్రాలకు తల్లిదండ్రులు బిడ్డలతో సహా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇస్కఫ్ కార్యదర్శి శ్రీకాంత్, కవి, రంగస్థల నటుడు పాతూరి సుబ్రహ్మణ్యం, చైతన్య పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,400, గరిష్ట ధర రూ.3, 200, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 841.50 అడుగుల వద్ద ఉంది.

వరాల వరికపూడిశెల

- ఎట్టకేలకు సాకారం
- సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా రేపు పనులు ప్రారంభం
- 70 ఏళ్లుగా కాగితాలకే పరిమితమైన ప్రాజెక్టు
- అన్ని అనుమతులూ సాధించిన రాష్ట్ర ప్రభుత్వం
- నిర్మాణం పూర్తయితే మూడు నియోజకవర్గాలు సస్యశ్యామలం



వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించే ప్రదేశాన్ని చూపుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చిత్రంలో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: పల్నాటి ప్రజల చిరకాల కల నెరవేరబోతోంది. వెనకబడిన ప్రాంతమైన పల్నాడు చెంతనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నా.. ఈ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటికి కటకటలాడుతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించి ఆరు దశాబ్దాలు దాటినా పరిస్థితిలో మార్పు లేదు. సాగర్ నిర్మాణ సమయంలోనే ఈ ప్రాంత నీటి సమస్యను గుర్తించిన జలవనరుల శాఖ నిపుణులు.. పల్నాడు ప్రాంతానికి తాగు, సాగునీరు అందించేందుకు వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించాలని అప్పటి ప్రభుత్వానికి సూచించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వరికపూడిశెలకు చేరుతాయి. ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తే వెల్దుర్తి, బొల్లాపల్లి, మాచర్ల, దుర్గి, కారంపూడి, యర్రగొండపాలెం మండలాల్లో 1.25 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు, లక్ష మందికి తాగునీరూ అందుబాటులోకి వస్తుందని ప్రతిపాదించారు. ఇన్నాళ్లకు ఈ ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులూ సాధించి బుధవారం పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేయనున్నారు.

కేంద్రాన్ని ఒప్పించి..

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువన 40 కిలోమీటర్ల దూరంలో నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన ప్రాంతంలో ఈ వరికపూడిశెల వాగు ఉంది. ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్నా కేంద్ర అటవీ, పర్యావరణ, వన్య ప్రాణ సంరక్షణ శాఖల నుంచి అనుమతులు

ఇదీ ప్రాజెక్టు స్వరూపం

ప్రాజెక్టు తొలిదశ పనుల అంచనా వ్యయం :	3,740 కోట్ల రూపాయలు
రెండో దశ పనుల అంచనా వ్యయం :	3,400 కోట్ల రూపాయలు
సాగునీరు అందే విస్తీర్ణం :	1,25,000 ఎకరాలు
తాగునీరు పొందే జనాభా :	1,00,000

తప్పనిసరి. ఈ విషయం తెలిసినా గత పాలకులు అనుమతుల జోలికి వెళ్లకుండా శంకుస్థాపనతోనే ప్రజలను మభ్యపెట్టే యత్నం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక అధికారులు, ప్రజాప్రతినిధులను ఢిల్లీకి పంపి కేంద్ర మంత్రులతో పలు దఫాలు చర్చలు జరిపేలా చూశారు. టైగర్ రిజర్వ్ ఫారెస్టు నుంచి నాలుగు కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కోసం 19.13 హెక్టార్ల అటవీ భూమిని కేంద్రం కేటాయించేలా చేశారు. ఇందుకు ప్రతిఫలంగా దుర్గి మండలం ఓబులేశునిపాలెం గ్రామంలో 21 హెక్టార్ల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు బదిలీ చేశారు. దీంతోపాటుగా ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని కేంద్రానికి తెలియజెప్పి అన్ని అనుమతులూ తీసుకొచ్చారు. వరికపూడిశెలవాగు కుడి గట్టుపై పంప్‌హౌస్ నిర్మాణానికి..



వెల్దుర్తి మండలంలోని గంగలకుంట సమీపంలో వరికపూడిశెల నిర్మించే ప్రదేశం

టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో నాలుగు కిలోమీటర్ల పొడవున పైపులైన్ నిర్మాణానికి వన్యప్రాణ సంరక్షణ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ పొందారు. దీనికోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విశేష కృషి చేశారు.

డీపీఆర్, టెండర్ల ప్రక్రియ పూర్తి

వరికపూడిశెల పథకాన్ని రెండుదశల్లో నిర్మించనున్నారు. మొదటి దశ పూర్తయితే వెల్దుర్తి మండలంలోని గంగలకుంట గ్రామం సమీపం నుంచి లిఫ్ట్ ద్వారా 1.547 టీఎంసీల నీరు ఎత్తి పోసి, పంట పొలాలు, తాగునీటికి సరఫరా చేయనున్నారు. రోజుకు 281 క్యూసెక్కుల పరిమాణంలో నీటిని లిఫ్ట్ చేయనున్నారు. రూ.340.26 కోట్ల విలువైన ఈ పనులకు సంబంధించి డీపీఆర్, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మెగా ఇంజినీరింగ్ సంస్థ పనులు చేపట్టనుంది. ఎత్తిపోతల ద్వారా తరలించే నీటిని వెల్దుర్తి మండలం వెల్దుర్తి, ఉప్పలపాడు, గొట్టిపాళ్ల, సిరిగిరిపాడు, బొదిలవీడు, గంగులకుంట, లోయపల్లి గ్రామాల పరిధిలో 24,900 ఎకరాలకు సరఫరా చేయనున్నారు. పైపులైన్ల ద్వారా నీటిని తరలించడం వల్ల సరఫరా నష్టాలు ఉండవని.. ఆయకట్టుకు సమర్థంగా నీటిని అందించవచ్చునని అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పైపులైన్ల ద్వారా ఆయకట్టుకు నీళ్లందించే తొలి ఎత్తిపోతల వరికపూడిశెల కావడం గమనార్హం. ఈ మొదటి దశ పనులతో సుమారు 20 వేల మందికి తాగునీరు ఇవ్వనున్నారు. రెండో దశలో సుమారు రూ.3,400 కోట్లతో పనులు చేపట్టేందుకు ఇప్పటికే డీపీఆర్‌ను అధికారులు రూపొందించారు. ఇందులో లిఫ్ట్ ద్వారా రోజుకు 858 క్యూసెక్కుల పరిమాణంలో 6.32 టీఎంసీల నీటిని ఎత్తిపోయనున్నారు. రెండో దశ ద్వారా మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడి మండాలు, వినుకొండ నియోజకవర్గంలో బొల్లాపల్లి, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలాల పరిధిలో 1,00,463 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నారు. సుమారు 80 వేల మందికి తాగునీరు ఇవ్వనున్నారు. వరికపూడిశెల రెండు దశల నిర్మాణం పూర్తయితే మొత్తంగా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్ష మందికి తాగునీరు అందనుంది.

పల్నాడును సుభిక్షం చేసే దిశగా

పల్నాడు ప్రజల చిరకాల కోరికైన వరికపూడిశెల ప్రాజెక్టు పనులకు సీఎం జగనన్న శంకుస్థాపన చేయనుండడం సంతోషకరం. ఈ ప్రాజెక్టు పూర్తయితే పల్నాడు సుభిక్షం కానుంది. గత పాలకులు ఈ ప్రాజెక్టు నిర్మాణం చేయకుండా ప్రజలను వంచించారు. ఈ ప్రాంతంపై అపార అభిమానం కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని అడ్డంకులూ తొలగించి బుధవారం పనులు ప్రారంభించి తన చిత్తశుద్ధిని మరోసారి చాటుకుంటున్నారు.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే

గర్వంగా ఉంది

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతో కీలకమైన అటవీ పర్యావరణ, వన్యప్రాణ సంరక్షణ శాఖ అనుమతులను తీసుకోకుండా గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టింది. దీనిని గుర్తించిన సీఎం వైఎస్ జగన్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అవసరమైన అన్ని అనుమతులూ సాధించారు. ఆ ప్రయత్నంలో నేను భాగస్వామి కావడం ఎంతో గర్వంగా ఉంది. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకొనే అవకాశం లభించింది.

– లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎంపీ

వైఎస్సార్ కలను జగన్ సాకారం చేస్తున్నారు



పల్నాడు ప్రాంత రైతుల దుస్థితిని గమనించి వైఎస్సార్ వరికపూడిశెలకు 2008లో శంకుస్థాపన చేశారు. ఆయన అకాల మరణంతో అది ఆచరణ రూపం దాల్చలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక రైతుల చిరకాల కల సాకారమవుతోంది.


– ఎస్.హనిమిరెడ్డి, రైతు, శిరిగిరిపాడు, వెల్దుర్తి మండలం

గతంలో శంకుస్థాపనతోనే సరి..

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వమైతే ప్రజలను నిలువునా వంచించింది. కేంద్రం నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండానే వరికపూడిశెలకు శంకుస్థాపన చేసి ఈ ప్రాంతం ప్రజలను మభ్యపెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో మాచర్లలో కరువు దీక్ష చేపట్టారు. ఆ సమయంలో తాము అధికారంలోకి వస్తే పల్నాడును సస్యశ్యామలం చేసే వరికపూడిశెల ప్రాజెక్టును ఖచ్చితంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే అత్యంత కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టుపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం పనులు ప్రారంభించనున్నారు.

ఆధ్యాత్మిక గో'పురం'

- 'అద్భుత చరితకు అద్దం'కి
- రాజుల కాలం నాటి గుడులకు ఆలవాలం
- సుందరంగా తీర్చిదిద్దితే అద్భుత పర్యాటక కేంద్రమే
- మ్యూజియం ఏర్పాటుకు వినతుల వెల్లువ



అద్దంకిలోని నగరేశ్వర ఆలయం (వేయి స్తంభాల గుడి)

అద్దంకి: అద్భుత చరితకు అద్దంకి నిలువుటద్దంలా, సజీవసాక్ష్యంలా నిలిచింది. చాళుక్యులు, కాకతీయులు, చోళులు, గజపతులు, విజయనగర రాజులు, రెడ్డి రాజులతో పాటు ఎన్నో రాజవంశాలు ఏలిన గడ్డగా చరిత్రపుటల్లో స్థానం సంపాదించుకుంది. కళలకు, సాహిత్యానికి పెద్దపీట వేసిన పురాతన పట్టణంగా ప్రాచుర్యం పొందింది. ఒకప్పుడు ఈ పట్టణంలో గతించిన ఆలయాలతో కలుపుకుని 108 గుడులు, 108 బావులు ఉండేవని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రస్తుతం కార్తిక మాసం సందర్భంగా ఈ ఆలయాల విశిష్టతను ఓ సారి తెలుసుకుందాం..

ఇవిగో చరిత్రకు నిదర్శనాలు

అద్దంకి పట్టణంలో రాజుల కాలంలో నిర్మించిన ఎన్నో ప్రసిద్ధ ఆలయాలు ఉన్నాయి. రాష్ట్రీయ రహదారిపై రోడ్డు పక్కనే ఉన్న కమఠేశ్వరాలయం 1420లో అంటే 15వ శతాబ్దంలో నిర్మితమైంది. దీనిని పెద కోమటి వేమారెడ్డి అధికార ప్రతినిధి బాణాల లింగప్ప నిర్మించారు.

- రెడ్డిరాజుల కోటలో వేయి స్తంభాల గుడిగా ప్రసిద్ధిగాంచిన నగరేశ్వరాలయం 11వ శతాబ్దంలో నిర్మితమైంది. దీనిని కొనిదెన చోళులు నిర్మించారు.
- ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే దారిలో పోతురాజు గండికి సమీపంలో ఉన్న వీరభద్రస్వామి, పాత శివాలయంగా పేరు గాంచిన రామలింగేశ్వరస్వామి దేవాలయాలను 1425లో ప్రోలయ వేమారెడ్డి నిర్మించారు.
- పెరికపాలెంలో ఉన్న నరసింహస్వామి ఆలయాన్ని విజయనగర రాజుల కాలంలో తాతాచార్యులు నిర్మించారు. శింగరకొండలోని క్షేత్రాధిపతి నరసింహస్వామి దేవాలయం కూడా ఆ కాలంలో నిర్మించినదే.
- నగర దేవత అద్దంకి నాంచారమ్మ ఆలయాన్ని 15వ శతాబ్దంలో నిర్మించారు.
- భవానీ సెంటర్‌లోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారికి పక్కన గాడిద శాసనం పూడిపోయి ఉంది. దీనిని వెలికితీయలేదు.
- అక్కడే ఎదురుగా వినాయక స్వామి ఆలయం, కాకానిపాలెంలోని కోదండ రామస్వామి ఆలయం 15వ శతాబ్దంలో నిర్మితమయ్యాయి.
- 16వ శతాబ్దంలో రంగనాయక స్వామి దేవాలయం, ఇదే కాలంలో మాధవస్వామి దేవాలయం నిర్మించినట్లుగా శాసన ఆధారాలు, చరిత్ర సాక్ష్యాలు ఉన్నాయి.
- వీటితోపాటు మిగిలిన దేవాలయాలు శాసనాలు కాలగమనంలో భూగర్భంలో కలిసిపోయాయి. కొన్ని దేవాలయాలు భూమి తవ్వే సమయంలో బయల్పడ్డాయి.
- వీటితోపాటు ఆంజనేయ స్వామి, తదితర దేవతల వంటి ఆలయాలు ఎన్నో ఉన్నాయి.
- అదే విధంగా పట్టణానికి దగ్గరలో మణికేశ్వరంలో స్వయంభుగా వెలసిన మణికేశ్వరాలయం (మల్లీశ్వరాలయం) ఉంది. ఇక్కడికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు.

తొలి తెలుగు పద్య శాసనం..



కమఠేశ్వరాలయం

పండరంగని అద్దంకి శాసనం తెలుగులో అత్యంత ప్రాచీనమైన పద్య శాసనం. ఇది కమఠేశ్వరాలయ ప్రాంగణంలో ఉంది. క్రీ.శ. 848లో పండరంగడు తను సాధించిన విజయాలను ఈ శాసనంలో తెలుగు పద్యరూపంలో చెక్కించారు. తెలుగు సాహిత్యం క్రీ.శ. 9వ శతాబ్ది నాటికే పద్య ఛందోరూపం వరకు అభివృద్ధి చెందినట్లుగా నిర్ధారించేందుకు ఇది ముఖ్యమైన ఆధారం. అప్పటికి దాదాపుగా 3 శతాబ్దాలు గడచిన తర్వాతే నన్నయ రచించిన తొలి తెలుగు కావ్యం శ్రీమదాంధ్ర మహాభారతం రచన జరిగింది.

విక్టోరియా రాణి సత్రం.. ప్రభుత్వ వైద్యశాల



విక్టోరియా మహారాణి సత్రం

బ్రిటిష్ కాలంలో భవానీ సెంటర్ నుంచి పాత గాందీబొమ్మకు వెళ్లే దారిలో నిర్మించిన వందేళ్ల నాటి ప్రభుత్వ వైద్యశాల ఇప్పటికీ ఉంది. పశువుల వైద్యశాల ప్రాంగణంలో విక్టోరియా మహారాణి విడిది చేసిన సత్రం శిథిలావస్థలో ఉంది. వీటన్నింటినీ అభివృద్ధి చేసి అద్దంకిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, చారిత్రక విశేషాలతో మ్యూజియం ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

కార్తిక మాసోత్సవాలకు పెదకాకాని సిద్ధం



మల్లేశ్వరస్వామి



దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు

పెదకాకాని: కార్తిక మాసోత్సవాలకు పెదకాకాని శివాలయం ముస్తాబైంది. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు. దర్శనానికి ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సందర్శకులకు తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించినట్టు ఈఓ ఎస్.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. కార్తిక పౌర్ణమి రోజున కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



మండే కిషోర్(ఫైల్)



గుండాల అభిలాష్(ఫైల్)

తెనాలిరూరల్/భట్టిప్రోలు: తెనాలి పట్టణంతోపాటు రూరల్ పరిధిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే భట్టిప్రోలు రైలుపేటకు చెందిన గుండాల అభిలాష్(21) అలియాస్ అభి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గుంటూరులో రైలు దిగి తన మిత్రుడైన అదే ప్రాంతానికి చెందిన గేరా ప్రేమ్ కుమార్‌కు ఫోన్ చేసి బైక్ తీసుకురావాలని కోరాడు. అతడు భట్టిప్రోలు దళితవాడకు చెందిన మండే కిషోర్(19)ను వెంట బెట్టుకుని వెళ్లాడు. తర్వాత ముగ్గురూ తెనాలి సుల్తానాబాద్‌లో ప్రేమ్‌కుమార్ పిన్నమ్మ ఇంటికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం ఓవర్‌బ్రిడ్జి దిగే సమయంలో మితిమీరిన వేగం వల్ల బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో ముగ్గురూ కింద పడ్డారు. అభిలాష్ అక్కడికక్కడే మరణించగా, కిషోర్‌ను వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కిషోర్ గుంటూరు మిర్చి యార్డులో ముఠా పని చేస్తుంటాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భట్టిప్రోలులో విషాదఛాయలు

మృతులు అభిలాష్, కిషోర్ ఇద్దరూ భట్టిప్రోలుకు చెందిన వారే. అభిలాష్ మృతితో అతని తల్లిదండ్రులు శకుంతల, జాన్‌బాబు శోక సంద్రంలో మునిగిపోయారు. వీరికి అభిషేక్‌తోపాటు మరో కొడుకు ఉన్నారు. భట్టిప్రోలు దళితవాడలో ఉండే మండే సుజాత(చిన్నమ్మాయి) భర్త చనిపోవడంతో కుమార్తె, కొడుకు కిషోర్‌తో కలిసి ఉంటున్నారు. కిషోర్ ఇటీవలే గుంటూరు వచ్చి మిర్చి యార్డ్‌లో పనిచేస్తూ తల్లికి, చెల్లికి ఆదరువుగా ఉంటున్నాడు. ఇప్పుడు కిషోర్ మృతితో సుజాత తల్లడిల్లుతున్నారు. అభిలాష్, కిషోర్ మృతదేహాలకు సోమవారం మధ్యాహ్నం పోలీసులు తెనాలి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కంచర్లపాలెం సమీపంలో..

తెనాలి మండలం కంచర్లపాలెం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం కూచినపూడికి చెందిన దున్న రాజేశ్వరరావు(28) ప్రస్తుతం కంచర్లపాలెంలో నివసిస్తున్నాడు. నందివెలుగు వైపు నుంచి తెనాలి వైపు తన స్కూటీపై ఆదివారం రాత్రి వస్తుండగా, ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో రాజేశ్వరరావు మరణించారు. బైక్‌పై వస్తున్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బైక్ అతి వేగంగా రావడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అరవిరిసిన కాంతులు

ఆకాశం అరవిరిసిన కాంతులతో ప్రజ్వరిల్లింది. వెలుగు దివ్వెల వైభవంతో తేజరిల్లింది. కొత్త ఆశలతో కోటి దీపాలు మిలామిలా మెరుస్తుండగా.. దీపావళి ధూంధాంగా సాగింది. పటాకుల చప్పుళ్లు.. పిల్లాపాపల కేరింతలతో వేడుక ఆనందాలను పంచింది. చిన్న పెద్ద, ముసలి, ముతకా తేడా లేకుండా అంతా ఒక్కచోట చేరి చేసిన సంబరం అంబరాన్నంటింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నిర్వహించిన దీపావళి కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది. గుంటూరు నగరంలో బాణసంచా కాలుస్తున్న కుటుంబాన్ని చిత్రంలో చూడొచ్చు.

– పాతగుంటూరు

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

మార్టూరు: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎం. శ్రీనివాసరావు వివరాల మేరకు.. మార్టూరు సంపత్ నగర్ కాలనీకి చెందిన వల్లెపు వెంకటస్వామి (45) హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేస్తూ పండుగ నిమిత్తం ఇటీవల గ్రామం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం గడ్డిమందు తాగిన వెంకటస్వామి విషయాన్ని భార్య కృష్ణవేణితో చెప్పాడు. బంధువులు సాయంతో కృష్ణవేణి భర్తను మార్టూరు, చిలకలూరిపేట ఆసుపత్రుల్లో చికిత్స చేయించింది. మెరుగైన చికిత్స నిమిత్తం ఆదివారం రాత్రి వెంకటస్వామిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. గుంటూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో మార్టూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు వెంకటస్వామి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: స్థానిక వావిలాల నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. దీపావళిని పురస్కరించుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు లక్ష్మానాయక్ కుటుంబ సభ్యులతో విజయవాడ వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేరని పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలోని లాకర్‌లో భద్రపరిచిన 56 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కేజీ వెండి వస్తువులు, రూ.40 వేలు అపహరించుకుపోయారు. బాధితుడు సోమవారం తిరిగి రావడంతో ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనం జరిగిన ఆనవాళ్లు కనిపించటంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పీ.ప్రభాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది.

పెదపులివర్రు శివాలయానికి కార్తిక శోభ


రాజరాజ నరేంద్రస్వామి దేవాలయం


వరదరాజస్వామి దేవాలయం

- కాశీ తర్వాత ప్రసిద్ధి చెందిన శివ, వైష్ణవాలయాలు
- నేటి నుంచి ప్రత్యేక పూజలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాలా త్రిపురసుందరీ సమేత రాజరాజ నరేంద్రస్వామి (శివాలయం), భూనీలా సమేత వరదరాజ స్వామి (వైష్ణవాలయం) దేవాలయాలకు ఒక విశిష్టత ఉంది. ఈ రెండు దేవాలయాలు పరస్పరం అభిముఖంగా ఉండటం విశేషం. ఇలా ఈ ఆలయాలు ఉత్తరాదిన కాశీలో, దక్షిణాదిన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో ఉండటం గమనార్హం. స్వయంభుగా కొలువై నారద మహర్షియే నిత్య పూజలు అందుకున్న ఆ కైలాస నాథుని దివ్యానుభూతి రూపం రాజారాజ నరేంద్రస్వామిగా కొలువై భక్తులచే నిత్య అభిషేకాలతో ప్రసన్న రూపంతో కనువిందు చేయడం ఇక్కడి విశేషం. వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం రాజరాజ నరేంద్రుని దృష్టిని ఆకర్షించిన పవిత్ర క్షేత్రం. వ్యాఘ్రపాద మహర్షి కోరిక పై కంచి వరదరాజ స్వామి ఇక్కడ వెలిసారు. శ్రీమద్ రామానుజాచార్యులు వారు ఇక్కడ వైష్ణవ ఆలయంలో విడిది చేసి వరదరాజ స్వామిని సేవించడంతో ఈ క్షేత్రం పవిత్ర స్థలంగా ప్రసిద్ధి గాంచింది ఈ దేవాలయాన్ని 1512వ సంవత్సరంలో బెజవాడ సామ్రాజ్యాధి నేతలు పున:ప్రతిష్ఠించినట్లు ఈ దేవాలయంలో శాసనాలు ఉన్నాయి. కార్తికమాసం పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయమంతా కార్తిక శోభ సంతరించుకుంది. కార్తిక మాసంలో భక్తులు వేకువజామున ఆలయానికి తరలివస్తుంటారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కార్తిక దీపారాధనలు చేయడం ఆనవాయితీ. శివాలయంలో మంగళవారం నుంచి కార్తిక మాస దీక్షా అభిషేకాలు, నిత్య కల్యాణాలు, లక్ష బిల్వార్చన, అన్నాభిషేకం, పంచదారాభిషేకం, జ్వాలాతోరణం, సామూహిక కుంకుమ పూజలు, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు జరగుతున్నాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్‌కుమార్ నిర్వహించగా కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, పర్యవేక్షిస్తున్నారు.

బ్యాంక్‌కెనాల్‌లో వ్యక్తి గల్లంతై మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

రేపల్లె రూరల్: ప్రమాదవశాత్తూ బ్యాంక్ కెనాల్‌లో వ్యక్తి గల్లంతై మృతి చెందిన సంఘటన మండలంలోని రుద్రవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నవీన్‌కుమార్ వివరాల మేరకు బాపట్లకు చెందిన గుడ్డిపల్లి మహేష్(39) తన భార్య స్వర్ణలతతో కలిసి ఆమె బంధువుల ఇంటికి వచ్చారు. మహేష్ భార్య, కుమార్తెతో కలసి ఆదివారం సాయంత్రం బ్యాంక్ కెనాల్‌కు పీతలు కడిగేందుకు వెళ్లారు. ఆ సమయంలో మహేష్ బ్యాంక్ కెనాల్‌లో ఈత వేస్తుండగా ప్రమాదవశాత్తూ గల్లంతైనట్లు బంధువులు గమనించారన్నారు. వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. సోమవారం ఉదయం చాట్రగడ్డలోని వంతెన వద్ద మృతదేహమై కనిపించాడన్నారు. మృతుని భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి


పెనుమూడి వినేష్ (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న బాలుడి బంధువులు

కొల్లూరు: స్నేహితులతో కలసి సరదగా గడపడానికి వెళ్లిన బాలుడు ఈతకు వెళ్లి నీట మునిగి అకాల మరణం పొందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన పెనుమూడి వేణు కుమారుడు వినేష్ (14) భట్టిప్రోలు విశ్వశాంతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సోమవారం సెలవు అవడంతో భట్టిప్రోలుకు చెందిన స్నేహితుడు పవన్‌తో కలసి కొల్లూరు మండలం తాడిగిరిపాడుకు చెందిన మరో స్నేహితుడు వినీల్ వద్దకు వచ్చారు. ముగ్గురూ కలసి గ్రామానికి సమీపంలో ఉన్న డ్రెయిన్‌లో ఈత వేసేందుకు దిగారు. వీరు దిగిన ప్రాంతంలో లోతు అధికంగా ఉండటంతో వినేష్, పవన్‌లు నీట మునిగారు. అది గమనించిన వినీల్ పవన్‌ను బయటకు లాగి, వినేష్‌ను కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. స్నేహితుడ్ని కాపాడుకునేందుకు ఇరువురు బాలురు కేకలు వేయడంతో సమీప పొలాలో పనిచేస్తున్న వ్యక్తులు వచ్చేప్పటికీ వినేష్ ఆచూకీ లభ్యం అవకపోవడంతో కాలువ వెంబడి గాలించడం ప్రారంభించారు. ప్రమాద సమాచారం అందుకున్న బాలుడి తండ్రి సంఘటనా ప్రాంతానికి చేరుకుని బాలుడు మునిగిపోయిన ప్రాంతంలో గాలించగా మృతదేహం లభ్యమైంది. బాలుడు నీట మునిగి మరణించడంతో కుటుంబ సభ్యులు, అనంతవరం వాసుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదచాయలు అలముకున్నాయి. బాలుడి మృతదేహాన్ని వెల్లటూరు తరలించారు. బాలుడి మృతిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

కాన్పు చేసిన 108 సిబ్బంది


పుట్టిన బిడ్డతో 108 సిబ్బంది

అద్దంకి: పేదల సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన 108 ఎందరో ప్రాణాలను రక్షిస్తున్నాయి. సోమవారం మండలంలోని కొటికలపూడి ఎస్సీ కాలనీకి చెందిన నూకతోటి గోవిందమ్మ పురిటి నొప్పులతో బాధపడుతోంది. సరిగా ఈసమయానికే 108కు కాల్ చేశారు. ఫోన్ కాల్ అందుకున్న సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లారు. అంబులెన్స్ ఈఎంటీ ఆనంద్ గర్భిణికి కాన్పు అయ్యే స్థితిని గమనించి ఇంటి వద్దనే కాన్పు చేశాడు. ఆడబిడ్డ ప్రసవించగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి, ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. తరువాత వారిద్దరిని స్థానిక మోదేపల్లి ప్రాథమిక వైద్యశాలలో చేర్పించారు.

క్వారీల్లో అప్రమత్తంగా పనులు చేయించాలి

ఈర్లకొండ క్వారీని పరిశీలించిన డీడీఎంఎస్


క్వారీలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీఎంఎస్

బల్లికురవ: గ్రానైట్ క్వారీల్లో కార్మికులను అప్రమత్తం చేస్తూ పనులు చేయించాలని మైన్స్ అండ్ సేఫ్టీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ ఇంపీరియల్ క్వారీలో కార్మికుడు గుర్రప్ప (44) విధుల్లో గాయాలపాలై చికిత్స పొందుతూ నరసరావుపేట వైద్యశాలలో చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం డీడీఎంఎస్ క్వారీని, ప్రమాద స్థలాన్ని రికార్డులను పరిశీలించారు. కార్మికులకు విధులు, బాధ్యతల పట్ల ఒకేషనల్ శిక్షణతో పాటు క్వారీ నిర్వాహకులు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రతిరోజు క్వారీ పరిసరాలు, రహదారుల వెంట దుమ్ము లేకుండా నీళ్ల చల్లించాలన్నారు. క్వారీలో నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే క్వారీలను సీజ్ చేస్తామని డీడీఎంఎస్ హెచ్చరించారు.

గల్లంతైన యువకుడిని కాపాడిన పోలీసులు


యువకుడితో పోలీసులు

బాపట్లటౌన్: సముద్రంలో స్నానాలు చేస్తూ గల్లంతైన యువకుడిని పోలీసులు కాపాడిన ఘటన సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లో నివాసముండే సిబరౌత్ జీవనోపాధి నిమిత్తం గుంటూరు పట్టణంలో ఒక మిల్లులో పని చేస్తూ కుటుంబంతో కలిసి గుంటూరులోనే నివాసం ఉంటున్నారు. ఆదివారం దీపావళి పండుగ కావడంతో మిల్లులో విధులు నిర్వహించే కొందరు కుటుంబ సభ్యులతో కలిసి సూర్యలంక బీచ్ వచ్చారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా సిబరౌత్ సముద్రంలో ఎక్కువ లోతుకు వెళ్లి మునుగుతూ ఉండగా అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా హెచ్చరిస్తుండగా ఇంతలో ఒక్కసారిగా వచ్చిన పెద్ద అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండడంతో ఔట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది, గజఈతగాళ్లు వెంటనే తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సముద్రంలోకి వెళ్లి యువకుడు ప్రాణాలు కాపాడి ఒడ్డుకు తీసుకొని వచ్చారు. మెరైన్ సీఐ సుబ్బారావు యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బంది, గజఈతగాళ్లకు యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్పీ అభినందనలు

తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యువకుడి ప్రాణాలను కాపాడిన హెడ్‌కానిస్టేబుల్ ఎం. పోతురాజు, మెరైన్ హోంగార్డ్ శ్రీనివాసరావు, గజఈతగాళ్లు గోపి, సుబ్బారావు, సత్యనారాయణలను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

బల్లికురవ: వ్యసనాలకు బానిసై అప్పుల పాలవటంతో జీవితం పై విరక్తితో ఓ యువకుడు పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వారం రోజులుగా మృత్యువుతో పోరాడి ఆదివారం మృతిచెందాడు. అందిన వివరాల మేరకు.. మండలంలోని కొనిదెన గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు (35) ఇంట్లో ఎవరులేని సమయంలో పొలాల్లో గడ్డి నివారణకు వాడే మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యాశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా


బోల్తా కొట్టిన గ్యాస్ సిలిండర్ల లారీ

పర్చూరు (చినగంజాం): ఎదురుగా ఉన్న ఆటోను తప్పించబోయి నిండు గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. ఈ ఘటన పర్చూరు మండలం బోడవాడ వద్ద సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఇండేన్ గ్యాస్ కంపెనీకి చెందిన నిండు సిలిండర్ల లారీ కొండపల్లి నుంచి ఇంకొల్లుకు వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా ఉన్న ఆటోను తప్పించబోయి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పాటు పెను ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, చీరాల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని సిలిండర్లను వేరే వాహనంలోకి ఎక్కించి పంపించి వేశారు. లారీలో మొత్తం 342 సిలిండర్లు ఉన్నాయని డ్రైవర్ తెలిపాడు. అదృష్టవశాత్తు సిలిండర్లు పేలకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఆటోమొబైల్స్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పట్నంబజారు: నగరంలోని ఆటోమొబైల్స్ గోడౌన్‌లో ఆదివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపకశాఖ ఏడీఎఫ్‌వో కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌరీశంకర్ థియేటర్ సమీపంలోని బాలాజీ ఆటోమొబైల్స్ గోడౌన్‌లో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారాన్ని అందించారు. భారీగా ఎగసి పడిన అగ్నికీలల్ని సిబ్బంది నిలువరించారు. ఈ క్రమంలో గోడౌన్‌లో ఉన్న రూ.40లక్షల విలువ చేసే ఆటోమొబైల్ వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు యజమాని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అయితే, అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా.. బాణసంచా వల్ల సంభవించిందా? అని తెలియాల్సి ఉంది. ప్రమాదం సంభవించిన ప్రాంతంలో ఆసుపత్రులు ఉన్న దృష్ట్యా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.